కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ్ చౌహాన్

కూకట్‌పల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అపూర్వ్‌చౌహాన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు సోమవారం జారీ చేసింది. అపూర్వ్ చౌహాన్ జోగులాంబ గద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన జడ్సీ అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమించడంతో అప్పటి నుంచి కూకట్‌పల్లి జోనల్ బాధ్యతను శేరిలింగంపల్లి జెడ్సీ స్నేహశబరీస్‌కు ఇచ్చారు. అపూర్వ్‌చౌహాన్ మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జడ్సీగా ఉపేందర్‌రెడ్డి


ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన స్నేహశబరీష్ బదిలీపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఐటీ అండ్ రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. ప్రభుత్వ ఆదేశాను సారం ఉపేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉపేందర్‌రెడ్డి గతంలో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఏసీ శానిటేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరు, యూసఫ్‌గూడ సర్కిల్‌కు చెందిన అన్ని శాఖల అధికారులు జడ్సీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండాపోయాడు. సూరేపల్లి జయరాజ్ జవహర్‌నగర్ ప్రభుత్వపాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు అఖిల్(17) ఈనెల 22వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి జయరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అఖిల్‌కు సరిగా వినపడదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు లక్షల రుణమాఫీ చేయడం హర్షణీయం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్‌కుమార్, దెంది అరవింద్‌రెడ్డి, పొడుగు అప్పారావు, గాలి బాలాజీ, శివచౌదరి, రజిత తదితరులు పాల్గొన్నారు.


వార్డు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ రోజాదేవి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలపై తక్షణం చర్యలు తీసుకొనేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. బాగ్ అమీర్‌లోని వార్డు కార్యాలయంలో సోమవారం అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ముఖ్యంగా వర్షాకాలంలో తలెత్తే సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వాహిద్ అలీ, ఆశ, ప్రియాంక, సుజాత, వినయ్‌కాంత్‌రెడ్డి, దివ్య, నరేష్, భద్రయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం


శిబిరంలో పరీక్షలు చేయించుకున్న ప్రజలు

ఫతేనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధి గౌతమీనగర్ కమ్యూనిటీ హాలులో బోయిన పల్లి రాఘవేంద్ర ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర ఆసుపత్రి ప్రతినిధి సునిల్, బీఆర్ఎస్ నాయకులు శశి, బాగయ్య, సురేందర్ నాయుడు, సలావుద్దీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్కూల్ మొదటి అంతస్తు ప్రారంభం

బాలానగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పూర్తయిన మొదటి అంతస్తును కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతోనే స్కూలు నిర్మాణం కోసం నిధులు సకాలంలో మంజూరైయ్యాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, యండి. ఖాజ, రాంచందర్, ఎడ్ల ప్రభాకర్, ఎలిజాల యాదగిరి, సభాపతిరెడ్డి, లతా, థెరిసా, కవిత, సదానంద్ పాల్గొన్నారు.

బోనాల నిధులకు 30లోపు దరఖాస్తు చేసుకోవాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బోనాల సంబురాల నిధుల కొరకు అర్హత ఉన్న దేవాలయాలు ఈనెల 30వ తేదీలోపు చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులు తమ కమిటీ లెటర్‌ప్యాడ్, బ్యాంక్ అకౌంట్ కాపీ, కమిటీ సభ్యుల ఆధార్‌కార్డు కాపీలు, 3 ఆలయ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


వాహహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుంటే కేసులు

పేట్‌బషీరాబాద్: వాహనాలకు నంబరు ప్లేట్ లేకుండా తిరుగుతూ పట్టుబడితే కేసులు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుచిత్రా, జీడిమెట్ల జంక్షన్ వద్ద సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్‌ను సోమవారం నిర్వహించారు. నంబర్ ప్లేట్స్ లేకుండా తిరుగుతున్న 22 మంది ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఫైన్ వేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ప్రయాణం చెయ్యాలని, రాంగ్ రూట్‌లో వచ్చి, ఇతరులను ఇబ్బందులకు గురిచెయొద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతో పాటు నెంబరు ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాన్ని నడిపించాలన్నారు. ఎస్ఐలు శ్యామ్‌బాబు, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు

మియాపూర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలోని జీఎస్ఎం మాల్‌లోని మధుర బంకెట్ హాల్‌లో పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మియాపూర్, బీహెచ్ఈఎల్ కమ్మసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి సంఘ సభ్యులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, పటాన్‌చెరువు కమ్మసంఘం అధ్యక్షుడు తాళ్లూరి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి కొల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారి పాపారావు, విజేత సూపర్‌మార్కెట్ ఎండి జగన్మోహన్‌రావు, సుబ్బారావు, రామారావు, రాఘవేంద్రరావు, నరేంద్ర ప్రసాద్, సూర్యనారాయణ, ప్రసాద్, మండవ పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

- రూ. 30 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు


పైప్‌లైన్ రోడ్డు నుంచి శోభనాకాలనీ వైపు వెళ్లే రోడ్డు

ఫతేనగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ పైప్‌లైన్ రోడ్డు నుంచి శోభనాకాలనీకి వెళ్లే రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. దీనిని ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో డ్రైనేజీ పనుల కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు కావడంతో రోడ్డు తవ్వి డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. కానీ తవ్విన రోడ్డును బాగు చేసేందుకు నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. అస్తవ్యస్తంగా మారిన రోడ్డు పనులు చేపట్టక పోవడంతో వాహనదారులు, పాదాచారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వర్షంనీరు గుంతల్లో చేరడంతో రోడ్డంతా బురదమయంగా మారుతోందని, రాకపోకలు సాగిస్తున్న వందలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- **నిధులు లేక ఆగిన పనులు**

రోడ్డు నిర్మాణం కోసం నిధులు లేకపోవడంలో పనులు నిలిచిపోయాయని కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తెలిపారు. ఈ రోడ్డు విషయంపై ఎమ్మెల్యే కృష్ణారావు వద్ద సమీక్షా సమావేశంలో చర్చించామని తెలిపారు. ఈ విషయంలో నగర మేయర్‌కు కూడా వినతిపత్రం అందించినట్టు వివరించారు. నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని ఈ సందర్భంగా తెలిపారు.

రోడ్ల సమస్యను పరిష్కరించాలి

వివేకానందనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి విజయనగర్‌కాలనీలో నెలకొన్న సీసీ రోడ్ల సమస్యను పరిష్కరించాలంటూ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలో నిలిచిపోయిన సీసీరోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గాంధీ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సత్యనారాయణ, స్వరూప, హన్మంతరావు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అధికారంలోకొచ్చి ఆరునెలలైనా చేసిందేమీ లేదు

ఓల్డుబోయినపల్లి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటినా ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం సిగ్గుచేటని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్‌తో కలిసి ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని బోయిన్‌చెరువు, మానస సరోవర్ హైట్స్ వద్ద ఉన్న నాలా, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన నాలా పనులను అధికారులు పూర్తి చేయలేదని, డ్రైనేజీ మురుగు నీరు రోడ్లపై పారుతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బోయిన్ చెరువులో గుర్రపుడెక్క పెరిగి దోమలు విపరీతంగా పెరిగడంతో రాత్రుళ్లు నిద్ర పోవడం లేదన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికే తనను భారీ మెజారిటీ గెలిపించారని వివరించారు. పెండింగ్ పనులను పూర్తి చేయించడం, అభివృద్ధి పనులకు కావలసిన నిధులను రాబట్టేందుకు త్వరలో జిల్లా మంత్రిని కలుస్తానని ఆయన నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, డివిజన్ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.


మానససరోవర్ వద్ద నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుర్తించిన పోలీసులు యువకుడిని కాపాడారు. మాదాపూర్ పర్వతనగర్‌కు చెందిన సాయికిరణ్(23) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన పోలీసులు అతడిని కాపాడారు. అనంతరం అతడికి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణలో భాగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతిలిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. 2023 ఏప్రిల్ 6న రూ. 519.77 కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ.20 కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ. 171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి- శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14 కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ. 136.03 కోట్లు అవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలి- రాయదుర్గం 220 కేవీ నుంచి 10.5 కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్ హెడ్‌లైన్లు వేసేందుకు రూ. 109.55 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.

ద్వారకా నగరాన్ని వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలి

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సముద్ర గర్భంలో ఉన్న పురాతన ద్వారకా నగరం ఒకప్పుడు ప్రపంచానికి రాజధానిగా ఉండేదంటూ తమ పరిశోధనలో తేలిందని ఇట్స్ సిక్స్ వావ్ సంస్థ అధ్యక్షురాలు షాహీద్ ఖాన్, తెలంగాణ చైర్మన్ కలదర్ వల్లం, ప్రధాన కార్యదర్శి రవీంద్రజిత్ తెలిపారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో ద్వారకా నగరాన్ని చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ప్రపంచ చరిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జై ద్వారక ప్రచారం బ్రోచర్, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ద్వారకా నగరం ప్రపంచానికి రాజధానిగా ఉండేదంటూ తమ పరిశోధన ఆధారాల వీడియోను వారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలోకి ద్వారకాను చేర్చేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ద్వారకా నగరాన్ని సంరక్షిస్తే మహాభారతానికి సంబంధించిన ఎన్నో కీలక ఆధారాలను బయటపెట్టవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సింధు నదీ లోయ, మెసపొటేమియా, పురాతన ఈజిప్ట్, చైనా, మినోయన్, ఓల్మెక్, నోర్టే చికో వంటి నాగరికతలకు సమకాలీనమైన పురాతన కాలంలో ద్వారకా ముఖ్యమైన రాజధాని నగరంగా ఉందని సూచించే ఆధారాలను వీడియోలో చూపించామని అన్నారు. ఘనమైన చరిత్ర ఉన్న ద్వారకాను భారతదేశ జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారకా నగరాన్ని వెలుగులోకి తీసుకురావడంతోపాటు, రక్షించి దాని చారిత్రక, పురాణాలకు సంబంధించిన ప్రాముఖ్యతను బయటపెట్టడమే లక్ష్యంగా తమ ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి మందలించిందని కుమార్తె, ఓ మహిళ బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. భద్రాచలానికి చెందిన నామవరపు జ్యోత్స్నశ్రీ పదో తరగతి తెలుగు మీడియంలో చదువుకుంది. అనంతరం ఆమె తల్లి నాగమణి భద్రాచలం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో బైపీసీ గ్రూప్ ఇంగ్లిష్ మీడియంలో చేర్పించింది. ఇంటర్ మొదటి సంవత్సరం అయిపోయిన తరువాత తనకు ఇంగ్లిష్ మీడియం అర్థం కావటంలేదంటూ చదువు మానేసి హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో ఉంటూ నిమ్స్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న పిన్ని స్వరూప వద్దకు వచ్చింది. నాలుగు రోజుల నుంచి అమీర్‌పేటలో ఓ షోరూమ్‌లో పనిచేస్తోంది. జ్యోత్స్నశ్రీ సరిగా పనిచేయకపోవడంతో యజమాని ఆమె తల్లి నాగమణికి ఫోన్ చేసి చెప్పింది. నాగమణి కుమార్తెకు ఫోన్ చేసి చదువు మానేశావు, పని కూడా సరిగా చేయకపోతే ఎలా అని మందలించింది. మనస్తాపం చెందిన జ్యోత్స్న ఉరేసుకుంది.

యూసుఫ్‌గూడ: రహ్మత్‌నగర్‌లో నివసిస్తున్న ఎస్.యాదగిరిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు ఈనెల 23వ తేదీన వాకింగ్ వెళ్లి వచ్చారు. వాషింగ్ మెషీన్ వచ్చిందని ఆరోజు మధ్యాహ్నం యాదగిరిరెడ్డికి కోడలు ఫోన్ చేయగా ఐదో అంతస్తు నుంచి కిందికి వెళ్లాడు. దాన్ని తీసుకొని పైకి వెళ్లాడు. భార్య విజయలక్ష్మిని పిలవగా పలకలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని 28న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదట ధర్నా చేయనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల నాయకులు పాండునాయక్, శ్రీనివాస్, సరోజబాయితో కలిసి వారు ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఫిబ్రవరి 15న సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, పార్వతి, యాదమ్మ, లక్ష్మణ్ నాయక్, బన్సీలాల్‌నాయక్, సుధీర్‌నాయక్, మురళినాయక్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్

స్థలాలను కాపాడాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నిజాంపేట్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట చెరువు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూరారంలోని సీఎంఆర్ స్కూల్‌లో ఆక్రమించిన స్థలంపై బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యకుడు ఆకుల సతీష్ మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. మైనార్టీ మోర్చా మహిళా నాయకురాలు అమలేశ్వరి, కార్పొరేషన్ సెక్రటరీ అరుణ్‌రావు, ఓబీసీ మోర్చా ప్రధానకార్యదర్శి ముఖేష్, ట్రేడర్‌సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సతీష్

- **ప్రజావాణిలో సమస్యలపై వినతి**

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన ప్రజావాణిలో మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల సమస్యలపై కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాష్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులకు రెయిన్‌కోట్లు, నూనెడబ్బాలు, చెప్పులు, సబ్బులు, గ్లౌజ్‌లు, టార్చిలైట్లు తదితర సామగ్రితో కలిపి కిట్టును ఏర్పాటు చేసి వెంటనే అందజేయాలన్నారు.

- కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్లలో ప్రజావాణిలో ప్రజలు 15 సమస్యలపై వినతి పత్రాన్ని అంద జేశారు.
- **పేట్‌బషీరాబాద్:** కొంపల్లి పురపాలక సంఘంలో అనుమతికి మించి నిర్మాణాలు జరుగుతున్నాయని, మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వెంకటేశ్వరకాలనీ వాసులు, కొంపల్లి అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు.
- **గచ్చిబౌలి:** శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చాలాకాలం తర్వాత నిర్వహించిన ప్రజావాణికి ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
- **చందానగర్:** ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి మంచి వేదికని చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ అన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగానికి నాలుగు అర్జీలు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి మూడు అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు


చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న కార్పొరేటర్, డీసీ

పెద్దచెరువులో కలుషిత నీరు కలవకుండా చర్యలు

రాయదుర్గం, జూన్24(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపన్‌పల్లి తండాలోని పెద్దచెరువులో కలుషితనీరు కలవడంతో చేపలు చనిపోయాయని. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సోమవారం చెరువును పరిశీలించారు. గ్రామం నుంచి వెలువడే కలుషిత నీరు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా చెరువులో కలవడంతో చేపలు మృతి చెందాయని కార్పొరేటర్ డీసీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన జడ్సీ డ్రైనేజీ, కలుషిత నీరు చెరువులో కలవకుండా శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామనానరు. మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రంగారెడ్డిజిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతునాయక్, డివిజన్ ఉపాధ్యక్షుడు తిరుపతి, నర్సింగ్‌నాయక్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమిలో పోలీసుల పహారా

మియాపూర్ ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న పహారా

మియాపూర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లోని హుడా ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమికి సోమవారం కూడా పోలీసు పహారా కొనసాగింది. చందానగర్, మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రెండోరోజూ 144 సెక్షన్ అమలులో ఉంది. అయితే మూడు రోజులుగా ఈ భూమిని కబ్జా చేసేందుకు వేలాదిగా ప్రజలు తరలిరావడంతో పోలీసులకు ప్రజలకు మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 550 ఎకరాల విస్తీర్ణంలో ఎవరూ రాకుండా సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మాదాపూర్ జోన్ డీసీపీ వినిత్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది పోలీసులు పహారా కాస్తున్న విషయం తెలిసిందే.. ఇప్పటికే ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా చొరబడి ఆక్రమించడానికి ప్రయత్నించడంతో పాటు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రోత్సహించిన 50 మందిని గుర్తించి ఆదివారం 25 మందిని, సోమవారం 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మియాపూర్ ఇన్‌స్పెక్టర్ రామలింగదుర్గప్రసాద్ తెలిపారు. అయితే సోమవారం హుడా అధికారులు ఇప్పటికే జేసీబీలతో భూమి చుట్టూ కాల్వలు తవ్వడమే కాకుండా ఫెన్సింగ్ కోసం ఇంజనీరింగ్ అధికారులకు నివేదించడంతో నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఫెన్సింగ్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.


కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ రషీదామహ్మద్‌రఫీ, స్థానికులు

భగత్‌సింగ్‌నగర్ స్థలాన్ని కాపాడాలని ఆందోళన

జీడిమెట్ల: భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నెంబరు 155లో గల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ రషీదామహ్మద్‌రఫీ స్థానికులతో కలిసి గాజులరామారం సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. సర్వేనెంబరు 155లో ప్రభుత్వ స్థలమని, గతంలో సర్వే చేసిన ప్రకారం 3 వేల 5 వందల గజాల స్థలానికి ఫెన్సింగ్ కోసం నిధులు మంజూరు చేయించామని, ఆ స్థలంలో 12 వందల గజాల స్థలం వదిలి, 25 వందల గజాల స్థలానికి మాత్రమే కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని, 12 వందల గజాల స్థలాన్ని ఎవరికి కోసం వదిలిపెడుతున్నారని డిప్యూటీ కమిషనర్‌ను కార్పొరేటర్ ప్రశ్నించారు. బస్తీ ఏర్పడిన నాటి నుంచి 35 వందల గజాల స్థలం ఉందని, ఆ స్థలాన్ని కాపాడి, ప్రజావసరాల కోసం ఉపయోగించాలని ఆయన కోరారు. అందులో జరుగుతున్న పనులను నిలిపివేయాలని, భగత్‌సింగ్‌వాసులతో కలిసి ఆందోళన అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.